శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# హౌసింగ్‌లో 100 శాతం సర్వే పూర్తి చేయాలి

**అర్హులైన ప్రతి ఒక్కరినీ యాప్‌లో నమోదు చేయించాలి**
**ఇల్లు రాలేదన్న ఫిర్యాదులు రావడానికి వీల్లేదు**
**అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే ప్రశాంత**



**కోవూరు, నవంబర్ 24, ప్రభాతవార్త :** నియోజకవర్గంలో అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇళ్ల నిర్మాణాలకు సర్వే పూర్తి చేయాలని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసంలో హౌసింగ్, ఎంపీడీవోలతో ఆమె సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సర్వే వివరాలపై ఆమె ఆరా తీశారు. ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ సర్వేకు 30 చివరి తేదీ కావున.. హౌసింగ్ అధికారులు, ఇతర సిబ్బంది సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారిని యాప్ నందు నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ప్రత్యేక బాధ్యతగా తీసుకుని ఇందులో భాగస్వాములు కావాలన్నారు. అర్హులైనవారికి ఇంటి స్థలం రాలేదన్న ఫిర్యాదులు రావడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అలాంటి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. కాబట్టి అధికారులు అ ఆరు రోజులు పట్టుదలగా పనిచేసి సర్వే పూర్తి చేసి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమీక్షలో నియోజకవర్గ హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబరు 24, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 11388.94 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 73.748 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 200, ఎన్‌ఎఫ్‌సికి500, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 2వేలు క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.001 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# నెల్లూరు నగర మేయర్ పై అవిశ్వాస తీర్మాన నోటీసు

- జాయింట్ కలెక్టర్ ను కలిసి అవిశ్వాసం తెలిపేందుకు ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలని వినతి
- గత నాలుగు సంవత్సరాలలో కేవలం ఏడు మాత్రమే సమావేశాలు ఏర్పాటు
- ప్రజల, కార్పొరేటర్ల విశ్వాసాన్ని మేయర్ ఎప్పుడో కోల్పోయారు
- కమిషనర్ల ఫోర్జరీ సంతకాలను చేసి మేయర్ భర్త అప్రతిష్ట పాలయ్యారు
- క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి
- నెల్లూరు నగర కార్పొరేషన్ ప్రతిష్టను మంట కలిపారు
- 40 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చాం
- డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్





**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి పై అవిశ్వాసానికి సంబంధించి జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, సుమారు 40 మంది కార్పొరేటర్లు మేయర్ పై నోటీసు అందజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసిన కార్పొరేటర్లు, అవిశ్వాసం తెలిపేందుకు ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలని, సుమారు 40 మంది కార్పొరేటర్ల సంతకాల పిటిషన్ ను జాయింట్ కలెక్టర్‌కు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ సమర్పించారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి తరపున కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మంత్రి నారాయణ తరపున నారాయణ కాలేజీల జిఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డిలుతో కలిసి మద్దత్తుగా వెళ్ళిన టిడిపి కార్పొరేటర్లు నిన్నటితో నెల్లూరు నగర కార్పొరేషన్‌లో మేయర్‌గా 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు అని రూపకుమార్ అన్నారు. ఈ సందర్భంగా రూప్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 91/ఎ ప్రకారం ఈ అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశామన్నారు. అనేక ఆశలు ఆశయాలతో మమల్ని గెలిపించిన ప్రజలకు ఎంతో కొంత మేలు చేయాలని సంకల్పంతో కౌన్సిల్లో అడుగుపెట్టామని నెల్లూరులోని 28 డివిజన్లో వివిధ రకములైన ప్రజల ప్రయోగ పనులను చేస్తూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని ఉద్దేశంతో తాము బాధ్యతలు చేపట్టామని కానీ నాలుగు సంవత్సరాలు పూర్తయిన మేయర్ 7 సమావేశాలు మాత్రమే ఏర్పాటు చేసి ప్రజా ఉపయోగ పనులను పక్కన పెట్టారన్నారు. మేయర్ అంటే కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు కార్పొరేషన్ ఆస్తులకు జవాబుదారీగా ఉండాలన్నారు. డివిజన్ల అభివృద్ధి చేయాల్సింది. ప్రక్కన బెట్టి తన సొంత పనులకు సమయం వెచ్చించారన్నారు. నాలుగు నాలుగేళ్లలో సార్లు మాత్రమే డివిజన్లో పర్యటించారని ఆయన తెలిపారు ఏడాదిలో ఎన్నికలు వస్తున్న తరుణంలో ప్రజల మౌలిక వసతులను కల్పించడం పై దృష్టి పెట్టకుండా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఎమ్మెల్యేలతో చర్చించి ఈ నోటీసు జెసికి అందజేశామన్నారు గిరిజన మహిళ అయినా మేయర్ ఉద్యోగం చేస్తూ గిరిజన కుటుంబాలలో మరణించే వారి వారి పిల్లలకు కారుణ్య పత్రాలు సైతం ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కలెక్టర్ మీటింగ్ ఏర్పాటు చేసిన రోజున మేయర్ పై అవిశ్వాసం పెట్టి దింపుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో 40 మంది కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన జెడ్పీసీఈవో



**కందుకూరు నవంబరు 24, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా జడ్పీ సీఈఓ ఎల్.శ్రీధర్ రెడ్డి సోమవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో కలిసిన సీఈవోని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గానికి రావలసిన నిధులు అభివృద్ధిపై ఆయనతో చర్చించారు.

# నేడు మంత్రి సత్యకుమార్ యాదవ్ జిల్లాలో పర్యటన



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 (సోమవారం) సాయంత్రం 5.00 గంటలకు విజయవాడ నుండి కారులో బయలుదేరి, రాత్రి 9.00 గంటలకు నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 25 (మంగళవారం) ఉదయం 8.30 గంటలకు నెల్లూరు నుండి టిపి గూడూరు మండల పరిధిలోని విలుకానిపల్లికి కారులో బయలుదేరి, ఉదయం 9.00 గంటలకు అక్కడకు చేరుకుంటారు. ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు టిపి గూడూరు మండల పరిధిలోని విలుకానిపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు విలుకానిపల్లి నుంచి కారులో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు మంగళగిరి చేరుకుంటారు.

# 150 టన్నుల బియ్యం స్వాహా

## ఉన్నతాధికారుల విచారణ



**ఉదయగిరి, నవంబర్ 24, ప్రభాతవార్త** ఉదయగిరి పౌర సరఫరాల గోదాములో ఉద్యోగి 150 టన్నుల బియ్యం స్వాహా చేసినట్లు తెలియడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ బియ్యం విలువ సుమారు 30 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. ఈ గోదాముల నుండి బడి పిల్లలకు మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ హాస్టల్‌లకు అలాగే నిరుపేదలకు అందించే రేషన్ షాపులకు చేరుతూ ఉంటాయి. అయితే ఈ గోదాముల్లో విధులు నిర్వహించే ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి ఈ ఉదంతానికి పాల్పడినట్లు అధికారుల విచారణలో తేలింది. విచారణ చేపట్టిన అధికారులు కూడా నామమాత్రంగా విచారణ చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. సదరు ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అంటూ స్థానికంగా చర్యలు వినిపిస్తున్నాయి. గతం నుండి కూడా రేషన్ డీలర్లు తమకు చేరేటప్పటికి బస్తాల్లో బియ్యం తక్కువ వస్తున్నాయని గోదాములోనే ఏదో జరుగుతుందని ఫిర్యాదులు చేస్తున్నారని కానీ ప్రస్తుతం పేదల బియ్యం స్వాహా కావడంతో విషయం బయట పడిందని అంటున్నారు. ఇదే కాకుండా జిల్లాలో ఉన్న మిగిలిన గోదాముల్లో కూడా అధికారులు తనిఖీలు చేయడం మంచిదని ప్రజలు సూచిస్తున్నారు.

# రైతుల అభ్యున్నతికి సీఎం పంచ సూత్రాలు

- లేగుంటపాడులో రైతన్నా మీ కోసం కార్యక్రమం
- అన్నదాతలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా పాలన
- ధాన్యం కొన్న 48 గంటల్లోనే నగదు జమ
- ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద 20 వేలు అందజేత
- రైతును రాజును చేసేలా అన్నదాతలకు పంచ సూత్రాలు



**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే ప్రశాంత రైతును రాజు చేసేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పంచ సూత్రాలను అమలు చేయనున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొని రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో రైతులకు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ప్రయోజనాలను వివరించారు. నీరు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో వ్యవసాయంలో కోవూరు నియోజకవర్గం మంచి ఫలితాలు సాధించాలని ఆమె అన్నారు. నియోజకవర్గం నుంచి అత్యధికంగా వరి పండిస్తున్న నేపథ్యంలో యూరియా కూడా అవసరమైనంద అందించేలా ప్రభుత్వంతో మాట్లాడామన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం మనదని అన్నారు. రైతు పండించే ప్రతి గింజకు, ప్రతి పంటకు న్యాయం చేసేలా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి 20 వేలు అందజేస్తున్నారని చెప్పారు. తాను కూడా రైతు బిడ్డనేనని, మీతో కలిసి నడవటానికి, మీ సమస్యలు పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ద్వారా ముందుకు వచ్చామన్నారు. నియోజకవర్గంలో ఉన్న యువ రైతులు మంచి ఆలోచనలతో ముందుకు వస్తే.. ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమల స్థాపనకుప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. రానున్న 5 సంవత్సరాల్లో రైతును రాజును చేసేలా సీఎం చంద్రబాబు పంచ సూత్రాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. నీటిభద్రత కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నారని చెప్పారు. డిమాండ్ ఆధారిత పంటలను పండిస్తే రైతులకు లబ్ధి చేకూరుతుందని, ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సాగుకు టెక్నాలజీ తోడైతే రైతులకు తిరుగుండదని, అందుకే అగ్రిటెక్ ను సీఎం ప్రోత్సహిస్తున్నారన్నారు. యువత టెక్నాలజీని అనుసంధానం చేసి వ్యవసాయం సులభతరం చేయాలన్నారు. అధికారులు కూడా రైతులకు టెక్నాలజీపై అవగాహన కల్పించాలన్నారు. కోవూరులో అధికారులు సమర్థవంతంగా పని చేస్తున్నారని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎంట్రప్రెన్యూర్‌లకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, సీఎం చంద్రబాబు ఆలోచనలతో యువత ముందుకు వచ్చి ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఎల్లప్పుడూ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఎప్పుడు ఏం చేయాలో సీఎంకు బాగా తెలుసని వివరించారు. గుడ్ల ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం మొదటి స్థానాన్ని కొనసాగిస్తూనే, మెరుగైన పౌల్ట్రీ పాలసీని (2025 2030) తీసుకొస్తున్నామన్నారు. పాడి పరిశ్రమ ప్రోత్సాహకానికి గ్రామీణ ప్రాంతాలలో పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, మెరుగైన వసతి గృహాలు (గోకులాలు), పశుగ్రాసాల పెంపకం, పశుదాణా పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల టీకాలు అందిస్తున్నారని చెప్పారు. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం, స్త్రీ శక్తిఉచిత బస్సు, దీపం2, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, 20 లక్షల ఉద్యోగాలు, మెగా డిఎస్సీ, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేర్చుతున్నారని చెప్పారు. ఇలాంటి మంచి ప్రభుత్వానికి అన్నదాతలందరూ తోడ్పాటును ఇవ్వాలని కోరారు. తిశితిలీళీ యాప్ ద్వారా రైతులు ఎప్పటికప్పుడు సమాచారం పొందాలన్నారు. లేదా వ్యవసాయాధికారుల దగ్గరికి వెళ్లి ఎలా చేసుకోవాలో తెలుసుకోవాలని చెప్పారు. డిసెంబర్ 3న వర్క్ షాప్ నిర్వహిస్తున్నారని, రైతులు పాల్గొనాలని, లాభసాటి వ్యవసాయాన్ని చేపట్టాలని ఆమె ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, సర్పంచి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటయ్య, ఆదర్శరైతు తుంగా సుజిత్ రెడ్డి, జొన్నవాడ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, మండలపార్టీ మాజీ అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, నాగారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ పార్వతమ్మ, ఎంపీటీసీ సునీల్‌రెడ్డి, అమరావతి ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నయీ చేతన 4.0 మార్పు కోసం ముందడుగు

- పోస్టర్ ఆవిష్కరించిన జెసిఎం వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం తిక్కన ప్రాంగణంలో నయీ చేతన 4.0 మార్పు కోసం ముందడుగు కార్యక్రమముపై జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించి, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంనకు పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, జిల్లా లీగల్ సర్వీస్ ఆథారిటీ, యూత్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, పౌర సంబంధాల శాఖ, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్, జిల్లా సమాఖ్య పాల్గొన్నారు. పిడి డిఆర్డిఏ నాగరాజ కుమారి మాట్లాడుతూ మండల స్థాయిలో గ్రామా స్థాయిలో జిల్లా స్థాయిలో సమావేశాలు ఏర్పాటుచేసుకొని పై డిపార్ట్మెంట్‌ల వారితో కలిసి జెండర్ ర్యాలీ నిర్వహించాలని కోర్యారు. జెండర్ వివక్షత కు వ్యతిరేకంగా జరుగు ఈ కార్యక్రమము నెల రోజులు జరుగుతుందని నయీ చేతన జరుగు నెలలో నాలుగు వారాలు, నాలుగు ప్రధాన అంశాల మీద జెండర్ క్యాంపైన్ నిర్వహించ వలసి ఉంటుందని పీడీ తెలిపారు.

**మొదటి వారం ప్రధాన అంశము** (25.11.2025 01.12. 2025): ఆర్థిక సహకారులుగా మహిళల పాత్ర పట్ల, సమాజంలో పెరిగిన అవగాహన దృక్పదాలలో మార్పు.

**రెండవ వారం ప్రధాన అంశం** (02.12.2025-08.12.2025) మహిళలకు పురుషలకు సమానముగా వనరులు అందుబాటులోకి తేవడం సమాన అవకాశాలు కల్పించడం.

**మూడ వారము ప్రధాన అంశం** (09.12.2025 - 15.12.2025) మహిళలు, బాలికలు మరింత బద్రంగా స్వేచ్ఛగా ప్రయాణించే పరిస్థిలులు కల్పించడం.

నాల్గవ వారం ప్రధాన అంశము (16.12.2025 - 23.12.2025), మహిళలు చేస్తున్న చెల్లింపు లేని సంరక్షణ గృహ పనుల చుట్టూ ఉన్న సామాజిక నియమాలను సవాలు చేసి మహిళల పని భారం తగ్గించటం, అంశాలను వారం వారీగా రోజు వారీగా చర్చించుకొని నయీ చేతన 4.0 మార్పు కోసం ముందడుగు కార్యక్రమమును విజయవంతం చేయాలని, డిఆర్డిఏ పిడి నాగరాజకుమారి తెలిపారు.

# అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- పరిష్కార వేదికకు 475 అర్జీలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** పలు సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డిఆర్‌డిఏ పీడీ నాగరాజుకుమారి, డ్వామ పిడి గంగాభవాని, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు రఘు రామ రాజు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికకు 475 ఫిర్యాదులు**

సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 475 ఫిర్యాదులు అందాయని అందులో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 181, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించి 12, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 32, పంచాయతీరాజ్ 39, పోలీస్ శాఖకు సంబంధించి 82 మిగతావి ఉన్నాయన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం

- ఎస్పీ అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 24, ప్రభాతవార్త :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫిర్యాదుదారులను మాట్లాడించి, వారికి తక్షణమే ఉపశమనం కలిగించే విధంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తగిన చర్యలు తీసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో యస్‌పి స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 113 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వింజమూరుకి చెందిన వ్యక్తిని, అనంతసాగరంలో ఉన్నటువంటి వాళ్ళ తమ్ముడు ద్వారా హైదరాబాదులో ఉన్న కేత హరికృష్ణ, ఇద్దరూ కలిసి వర్క్ ఫ్రం హోం జాబులు ఇప్పిస్తామని నమ్మించి, తన వద్ద తన స్నేహితులు వద్ద కలిపి సుమారు 12 లక్షలు పైగా నగదు తీసుకొని, ఉద్యోగాలు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని, ఇబ్బందులకు గురి చేస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. బాలాజీ నగర్ పరిధికి చెందిన మహిళ, తన కుటుంబ సమస్యల కారణంగా భర్త నుండి విడిగా ఉంటూ తన పెద్దన్న ఇంట్లో ఉంటున్నట్లు, తన పెద్దన్న భార్య అయిన నస్రిన్ తన భర్తతో గొడవలు పడి దూరంగా ఉంటున్నట్లు, కక్షపూరితంగా తన అన్న భార్య, తన తరపు వారి ఫోన్లో నుంచి తనకు అసభ్యకరంగా మెసేజ్లు పంపిస్తూ, అశ్లీల ఫోటోలు పెడుతూ, బూతులు తిడుతూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు. కందుకూరుకి చెందిన మహిళ తన కుమార్తె, ఓ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నట్లు, ఈనెల 16 న స్కూల్‌కి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఉన్నారని, తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలోఅడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, రూరల్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, ఎస్బి డి.ఎస్.పి శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, సీఐలు భక్తవత్సల రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో సత్యసాయిబాబా శతజయంతి



**సంగం నవంబర్ 24 ప్రభాతవార్త :** సంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగ ంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి ఎంపిడిఒ కె.షాలెట్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.

## మహిళలు ఆర్ధికంగా ఎదగాలి



**చేజర్ల నవంబర్ 24 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి జీవనోపాధి కల్పన కేంద్రం పథకం ద్వారా బ్యాంకు అందించే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సేర్ప్ అసెట్ వెరిఫి కేషన్ క్యాటలిస్టు మేనేజర్ అధికారిని విమల పేర్కొన్నారు. ఈ సందర్భంగా చేజర్ల మండలంలోని తూర్పు కంభంపాడు యనమదల గ్రామాలలో రుణాలు మంజురు చేసిన గేదెల యూనిట్లను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతు బ్యాంకు ద్వారా 5 లక్షల రూపాయాలు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అధికారులు మధుసూదన్ ఏపిఎం సుజన సిసిలు పాల్గోన్నారు.

## ప్రాధమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన హాస్పటల్ డవలప్‌మెంట్ కమిటీ మెంబర్ కలివెల జ్యోతి



**సీతారామపురం నవంబర్ 24 ప్రభాతవార్త :** స్ధానిక ప్రాధమిక ఆరోగ్యకేంద్రాన్ని సీతారామపురం మండల ఉదయగిరి హాస్పటల్ డవలప్‌మెంట్ కమీటి మెంబర్ కలివెల జ్యోతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవలు, సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణపై ఆమె ఆరా తీశారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతు వైద్యసేవలకోసం వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించా లన్నారు. వైద్యసిబ్బంది ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహారించాలని విధులకు సంబందించి సమయపాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. సిబ్బంది పిహెచ్‌లలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. సేవలలో లోపాలు ఏమైనా కనిపిస్తే వెంటనే సరి చేసుకోవాలని ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు .పిహెచ్‌సిలో సమస్యలు ఉంటే తెలిపితే వాటిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకొని వెళ్లి ఆయన సహకారంతో ఉన్నతాధికారులకు సిఫారస్ చేయడం జరుగుతుందని వైద్యులకు సూచించారు.

## 10వ తరగతి విద్యార్ధుల పరిక్ష ఫీజులకు బిజివేముల సొంత నిధులు



**మర్రిపాడు, నవంబరు24ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని 10వ తరగతి విద్యార్థులందరికీ పెద్ద మొత్తంలో మేలు చేకూర్చే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన మేరకు బ్రాహ్మణపల్లి గ్రామస్తుడు బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి ఒక ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. మండలంలోని మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 350మంది 10వ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఫీజు లను తన సొంత నిధుల ద్వారా పూర్తిగా భరించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని 10వ తరగతి విద్యార్థులెవరూ పరిక్షల ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజుల మొత్తం 2025 నవంబర్ 26వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3గంటలకు మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద అందజేయనున్నామని సోమవారం వెల్లడించారు. ఈనిర్ణయం ద్వారా మండలంలోని విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో ఉపశమనం లభించనుందని , విద్యాభివృద్ధికి బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి సేవ అత్యంత ప్రశంసనీయమి విద్యావర్గాలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## పోలిరెడ్డిపల్లిలో వేపచెట్టుకు పాలామృతం



**మర్రిపాడు, నవంబరు24ప్రభాతవార్త:** మర్రిపాడు మండలంలోని పోలిరెడ్డి పల్లి గ్రామంలో చెరువువద్ద వేపచెట్టుకు సోమవారం పాలుకారుతున్న సంఘటన గ్రామంలో సంచలనం రేకెత్తించింది. వేపచెట్టు నుండి పాలు కారుతున్న దృశ్యం చూసి గ్రామస్తులు ఆశ్చర్యానికి గురయ్యారు . ఈసంఘటనా స్థలానికి భారీగా చేరుకున్న గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మాటను గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. ఆ కాలజ్ఞానంలో కలియుగంలో వేపచెట్టుకు పాలుకారేను అన్నమాట నిజమైందని గ్రామస్తులు చర్చించుకున్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు



**కావలి, నవంబర్ 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని కావలి ప్రాంతీయ రవాణా అధికారి మురళీధర్ రావు తెలియజేశారు. కావలి ముసునూరు టోల్ ప్లాజా వద్ద సోమవారం పాఠశాల, కళాశాలలకు సంబంధించిన పలు బస్సులలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై మరియు హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మురళీధర్ రావు మాట్లాడారు ప్రమాదాల నియంత్రణపట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. బస్సులలో అగ్ని ప్రమాదాల నియంత్రణ కిట్టులను కలిగి ఉండాలని తెలియజేశారు. ప్రమాదాల సమయంలో ఎమర్జెన్సీ డోర్లు వాడకం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని అవి పని చేసే విధంగా ఉండాలని తెలియజేశారు. బస్సులలో ప్రయాణించే విద్యార్థులకు బస్సులలో ఎమర్జెన్సీ కిట్టులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా బస్సులను నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై కలిగే ప్రయోజనాలు వివరిస్తూ అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో కావలి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆర్. సుందర్రావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కరుణాకర్, లక్ష్మిబాయి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సమాధులు తొలగిస్తున్నారని దళితులు ఆందోళన



**వింజమూరు, నవంబర్ 24, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని అశోక్‌నగర్ అరుంధతీయ వాడ వాసులు ఉపయోగించుకుంటున్న సమాధులను తొలగిస్తున్నారని ఆయా కాలనీ వాసులు సోమవారం ఆందోళన చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు సర్వే నెంబరు 495/2లో 70 సంవత్సరాల నుండి ఇక్కడ కొంత భాగంలో స్మశాన వాటికగా ఏర్పా టు చేసుకుని ఉన్నామని, ఇప్పుడు మా స్థలం అంటూ అక్కడ ఉన్న సమాధులను ధ్వంసం చేసి చదును చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 70 సంవత్సరాలుగా ఇక్కడ సమాధులను ఏర్పాటు చేసుకుంటూ ఉంటే ఇప్పుడు మా స్థలం అంటూ ఎప్పుడు అభ్యంతరం తెలపకుండా ఇప్పుడు రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై స్థల యజమాని భయపరెడ్డి సోదరులు మాట్లాడుతూ తాము సుమారు 17 ఎకరాలు భూమిని 1972 లోనే కొనుగోలు చేశామని భూమి విక్రయించిన వారు న్యాయస్థానంకు వెళ్లడంతో సదరు భూమిపై తాము తీర్పు వచ్చేంత వరకు వేచి ఉన్నామని ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో తాము రికార్డుల ప్రకారం సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు చదును చేయాల్సి వచ్చింది తప్ప సమాధులను చదును చేయాల్సిన అవసరం లేదన్నారు. వారు స్మశానంగా వాడుకుంటున్న స్థలం వారి సొంతదైతే వారి దగ్గర ఉన్న రికార్డులనుఅధికారుల వద్దకు తీసుకువస్తే తమ వద్ద ఉన్న రికార్డును కూడా తీసుకువస్తామని అక్కడే సమస్య పరిష్కారం అవుతుందని వారు తెలిపారు.

## శ్రీఖరేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నీలిమ నియామకం

**తోటపల్లిగూడూరు, నవంబర్ 24, ప్రభాతవార్త:** శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న కామాక్షి దేవి సమేత ఖరేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా సర్వేపల్లి శాసనసభ్యుల ఆశీసులతో మన్నెం నీలిమ నియమితులయ్యారు. నీలిమ గతంలో తోటపల్లిగూడూరు గ్రామ సర్పంచిగా ఎన్నికై సత్సేవలతో ప్రజల్లో మంచి గౌరవం పొందిన నాయకురాలు. సోమవారం శాసనసభ్యులను కలసి తనను చైర్మన్‌గా నియమించినందుకు నీలిమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్మి కష్టపడి పనిచేసిన వారిని పార్టీ ఎల్లప్పుడూ గౌరవిస్తుంది. విధేయతకు విలువ ఇచ్చే సంస్కృతి తెలుగుదేశం పార్టీలో ఎప్పటికీ కొనసాగుతుంది అని అన్నారు. అలాగే నీలిమ మాట్లాడుతూ తన విజయంలో తోడ్పడిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఈమె తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర గౌడ్ భార్య అన్న విషయాన్ని గుర్తుచేస్తూ, పార్టీ ఇచ్చిన ప్రోత్సాహానికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోమ్మి సురేంద్ర.మండల తెలుగుదేశం అధ్యక్షులు కొణతం రఘుబాబు, ప్రధాన కార్యదర్శి మన్యం జితేంద్ర గౌడ్, మాజీ ఎంపిటీసీ సభ్యులు మన్నెం మధుసూదన్, తెలుగు యువత మండలాధ్యక్షుడు గంగపట్నం సుధీర్, మధు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## అనంతమడుగులో రైతన్న మీ కోసం



**సైదాపురం, నవంబర్ 24, ప్రభాతవార్త :** అనంతమడుగు గ్రామ రైతు సేవ కేంద్రం పరిధిలో వ్యవసా యశా ఖ బృందం రైతన్న మీ కోసం కార్య క్రమం సోమవారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పంచ సూత్రాలపై అవగాహన కల్పి ంచి ఏపీఏ ఐఎంఎస్ యాప్‌ను రైతు లకు ఇన్‌స్టాల్ చేశారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రమోహన్, వ్యవసాయ సహాయకులు పచ్చ రాజశేఖర్, ఉమామహేశ్వర్, నరేంద్రసాయి, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రం ప్రహరిగోడకు చర్యలు

వార్తకు స్పందన



**వలేటివారిపాలెం నవంబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని చుండి అంగన్‌వాడీ కేంద్రంలో వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. ఆదివారం అంగన్‌వాడీ కేంద్రానికి రక్షణ ఏది..? అనే శీర్షికన నెల్లూరు వార్త మినీలో ప్రచురితమైంది. ఇందుకు సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శి రవికు మార్‌లు స్పందించారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని పశువులను తొలగించారు. పరిసరాలను శుభ్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రహరిగోడ నిర్మాణానికి నిదులు మంజూరైనాయన్నారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

## సిపిఐ పోరాటంతో దిగి వచ్చిన సర్పంచ్ లబ్దిదారులకు పట్టాలు వెనక్కించిన సర్పంచ్



**వలేటివారిపాలెం నవంబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని కొండసముద్రంలో ఇంటినివేశనస్థల బాధితులైన ఎస్సీలకు న్యాయం జరిగిందని సీపీఐ కార్యదర్శి బి.సురేష్ తెలిపారు. గత ప్రభుత్వహయాంలో 86మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. వీటిని అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీదర్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాల పంపిణీ జరిగింది. అయితే సదరు పట్టాలును సర్పంచ్ తన పలుకుబడితో తనవద్దనే ఉంచుకొని లబ్దిదారులను ఇబ్బందులకు గురిచేశారని ఆయన తెలిపారు. ఈ నేపద్యంలో బాధితులు సీపీఐని సంప్రదించారు. సీపీఐ నేత బి.సురేష్ తన సహచర బృందంతో కొండసముద్రం వెళ్లి సమస్యను పరిష్కరించారు. సర్పంచ్‌తో మాట్లాడి సదరు పట్టాలను లబ్దిదారులకు అందచేసినట్లు ఆయన వివరించారు. ఇందుకు లబ్దిదారులుకు సీపీఐ నేతలుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు మాట్లాడుతూ నిరుపేదల పట్టాలను తీసుకొని వారిని ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. భూ పోరాటాలకు సిపిఐ ప్రజలకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నియోజకవర్గంలో ఇలాంటి సమస్యలు ఇంకా ఏమైనా ఉన్నాయా అని తెలుసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. కొండసముద్రంలో జరిగిన సంఘటన దృష్టిలో పెట్టుకొని వారికి అక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం కేటాయించిన నగదును వారికి అందజేయడంతో పాటు అన్ని వసతులను కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట సిపిఐ, ఏఐటియుసి నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్ ఉన్నారు.

## వైసిపి యువనేత జన్మదినాన సేవా కార్యక్రమాలు



**కావలి, నవంబరు24ప్రభాతవార్త :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ఈతముక్కల చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం కావలి ఏరియా వైద్యశాల నందు వైకాప పట్టణ యువజన విభాగ అధ్యక్షులు సమాధి చైతన్య యాదవ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏరియా వైద్యశాల నందు రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి 100 మంది యువత రక్తదానం నిర్వహించారు. 700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాధి చైతన్య యాదవ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైయస్స్ జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తితో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోని పట్టణ ఆధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ సలహాలతో పేదలకు సహాయం చేయాలనే ఉద్ధేశంతో డబ్బును వృధా చేయకుండా సమాజానికి పనికివచ్చే విధంగా సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, విజయ్ , శ్రీకాంత్, సునీల్, గవాస్కర్ మరియు మిత్రబృందం వున్నారు.

## గ్రావెల్ తవ్వుతున్న వాహనాలు అప్పగిస్తే విడుదల చేయడం అన్యాయం



**కావలి, నవంబరు24ప్రభాతవార్త :** కావలి రూరల్ మం డలం రుద్రకోట గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతు న్న వాహనాలను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే వాటిని విడుదల చేయడం అన్యాయమని దళిత సంఘ ర్షన జిల్లా ఆధ్యక్షుడు మల్లి పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా రుద్రకోట గ్రామలోని దళితవాడ గ్రామ పెద్దలతో కలసి కావలి ఆర్‌డిఓ సన్ని వంశీకృష్ణను సోమవారం కలసి వినతి పత్రాన్ని ఆందజేసి నేల మీద కూర్చోని నిరసన తెలిపారు. అనంతరం ఎస్. మల్లి మాట్లాడుతూ ఈ నెల 21వ తేది రుద్రకోట గ్రామంలో 350 ఎకరాల సిజెఎఫ్‌ఎస్ ల్యాండ్‌లో కావలి పాతూరుకు చెందిన ఒక జెసిబి ఆర్ధరాత్రి గ్రావెల్ తవ్వుతున్న విషయాన్ని గమనించిన గ్రామ దళితులు అడ్డగించి పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలియచేయడం జరిగిం దన్నారు. ఆ వాహనాలను ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందన్నారు. రెండు రోజులకే వాటిని విడుదల చేయడం అన్యాయమని తెలిపారు. వందల ఎకరాల సిజెఎఫ్‌ఎస్ భూములలో గ్రావెల్ తవ్వి రుద్రకోట గ్రామంను స్మశానంగా తయారు చేశరన్నారు. అఖరికి దేవస్థానం భూములలో కూడా గ్రావెల్ తరలించడం జరిగిందన్నారు. కావలికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులతో జతకట్టి ట్రక్కులు, జేసిబిల సాయంతో గ్రావెల్ తవ్వుతూ కోట్లు గడిస్తున్నారని చెప్పారు. ఈవిషయంపై తమకు ఎమి తెలియదని ఆర్డీఓ తెలియజేశారన్నారు. సమగ్ర విచారణ నిర్వహించి కలెక్టర్‌కు నివేధిక పంపిస్తానని ఆర్డీఓ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యామ్రకంలో ముక్కు గోపాల్, ముక్కు శ్రీనివాసులు, లక్ష్మయ్య, వాసు, నరసింహ రావు, శ్రీనయ్య, జడ్డా వాసు పాల్గోన్నారు.

## కావలికి ప్రముఖ వైద్యులు శ్రీనివాస రావు రాక



**కావలి, నవంబరు24ప్రభాతవార్త :** కావలి బ్రహ్మణ మహా సంఘం ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ పివిఎస్ ప్రసాద్ అధ్యక్షతన నేడు కావలి పాత ఊరులోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణం నందు సాయంత్రం నాలుగు గంటలకు విద్యార్థులతో జరుగు కార్యక్రమానికి హెల్త్ అండ్ వెల్నెస్ సంగపూర్ హెల్త్ నెస్ అకాడమి ప్రముఖ ఆయుర్వేదిక వైద్యులు డాక్టర్ ఈమని శ్రీనివాస రావు పాల్గోని ఆయుర్వేద ప్రాముఖ్యత, అనేక రకాల వ్యాధులు నివారణకు సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ప్రెసిడెంట్ సివిఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఈమని శ్రీనివాస రావు ఇప్పటివరకు 37 దేశాలలో 37వేల సార్లు అనేక కార్యక్రమాలలో పాల్గోనం జరగిందన్నారు. ఆయనకు నంది అవార్డు, అబ్దుల్ కలాం ఎక్సెలెన్సీ అవార్డు, సేవ రత్న అవార్డు, స్పెషల్ అవార్డులు, తెలంగాణా సియం ద్వారా అందుకోవడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ అవార్డు, మదర్ తెరిసా అవార్డు తదితర స్పెషల్ అవార్డులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా అందుకోవడం జరిగిందన్నారు. ఆయన నాటి పట్టుకోని మనకున్న వ్యాధిని తెలియజేయడం జరుగతుందన్నారు. ఎలాంటి వ్యాధులకు ఏవిధమైన మందులు ఇవ్వాలో కూడా చెప్పగలరని తెలిపారు. విద్యార్దులు ఈ కార్యక్రమంలో పాల్గోనాలని కోరారు.

## ఎన్.ఎస్.ఎస్. క్యాంపులో బాగంగా ఉచిత వైద్య శిబిరం



**కావలి, నవంబరు24ప్రభాతవార్త :** జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ఎన్.ఎస్.ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో బాగంగా అరవ రోజు కావలి శివారులోని పెంకుల ప్యాక్టరీ వద్ద గిరిజన కాలనీలో కావలి చెరువు దగ్గరలోని ఎస్టీ కాలనీలో ఉచిత వైద్యశిబిరం మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య శిబిరం నందు డాక్టర్ వెంకటేశ్వర బాబు, డాక్టర్ మహేష్, డాక్టర్ మోహన్, డాక్టర్ మేఘనాథ్ చౌదరి పాల్గొని కాలనీ వాసులకు కంటి, పంటి, మధుమేహం, రక్తపోటు, తదితర సాధారణ వ్యాధులకు పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ ఛైర్మన్ దోడ్ల మనోహర్ రెడ్డి మాట్లాడారు. ఆరోగ్యమే మహా భాగ్యమని ప్రతి ఒక్కరు వారి వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు కలిగి వుండాలని కోరారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవడం, పెరిగిన గోళ్లను కత్తిరించుకోవడం, సురక్షితమైన తాగునీరు సేవించడం, వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనారోగ్యాల భారిన పడకుండా వుండవచ్చన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలు గురించి కావలి ఒకటవ పట్టణ ఎస్సై ఎస్‌కె జమాల్, రెండవ పట్టణ ఎస్సై ఎస్‌కె గౌస్ భాషాలు కాలనీలో వుండే యువతీ యువకులకు, జాతీయ సేవా పథకం వాలంటీర్లకు అవగాహన కల్పించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి పి. నాగేశ్వరరావు, ఎస్.ఎ అయూబ్ అహమద్, నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి. సుబ్రమణ్యం నాయుడు, స్వయం ఉపాధి సంచాలకుడు డాక్టర్ ఆర్. మాల్యాద్రీ, విశ్రాంత ఆధ్యాపకులు ఎం.వెంకటేశ్వర్లు, పి. బాస్కర రావు, ఆధ్యాపకులు డాక్టర్ సిహెచ్ సుబ్బరాయుడు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి. ప్రసాద్ రెడ్డి, టి.వి రమణ, జాతియ సేవా పథకం వాలంటీర్లు తదితరులున్నారు.

## ప్రజా వేదిక పరిష్కారంలో అర్జీలు



**కొడవలూరు, నవంబర్ 24 ప్రభాతవార్త :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార కార్యక్రమానికి మండల ప్రజలు కార్యాలయంకు చేరుకుని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డికి అర్జీలు అందజేశారు. ఆలూరుపాడు గ్రామానికి చెందిన మోచర్ల ఆదిశేషమ్మ పొలం సంబంధించి భూమి విస్తరణం తగ్గిందని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వచ్చిన అర్జీలు భూమి సమస్యలో తప్పిదాలు, ఆధార్ కార్డులు, వివిధ సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వాటిని సంబంధిత రెవిన్యూ అధికారులకు తెలియపరచి పరిష్కరిస్తామని అర్జీదారులకు తెలిపారు. అదేవిధంగా పలు శాఖ అధికారులతో పలుఅంశాలను తెలిపి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, మండల విద్యాశాఖ అధికారిని వసంతకుమారి, ఇరిగేషన్ ఏ ఈ సురేష్, ఏపిఎం కృష్ణవేణి, రెవిన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వోలు తదిత రులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష



**కొడవలూరు, నవంబర్ 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక మండల అధికారులు పాలొన్నారు. మండలంలో వివిధ ప్రజా సమస్యలపై పట్ల జిల్లా అధికారులు మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పారిశుద్ధం గ్రామాలలో పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పెన్షన్ కొరకు వినతి పత్రం వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరెన్టెంట్ రాంప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, వ్యవసాయ అధికారిని రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తాటేకులదిన్నెలో కోటి సంతకాల సేకరణ



**కొడవలూరు, నవంబర్ 24ప్రభాతవార్త:** మండలంలోని తాటేకుల దిన్నే గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు ఆమోదించబడినాయి వాటిలో 7 మెడికల్ కాలేజీలు పూర్తిగా నిర్మాణం కావడం జరిగింది. కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చర్యలకు దారితీస్తూ అన్యాయం చేస్తోందని వ్యాఖ్యానించారు. ఈ ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు అందాల్సిన మెడికల్ సీట్లు దక్కకపోవడం జరుగుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అనంతరం ప్రజలు స్వచ్ఛందంగా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ మారం రెడ్డి రంగారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## కొత్త నాటకంతో రైతులకు మరో మోసం : మాజీ మంత్రి కాకాణి



**వెంకటాచలం నవంబర్ 24 ప్రభాతవార్త:** కొత్త నాటకం పేరుతో రైతులను మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని తీసుకోరాటం జరిగిందని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ రైతులకు యూరియా అందక విత్తనాలు సకాలంలో పంపిణీ జయక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల పండించిన దానానికి కనీసం మద్దతు ధరలు లేకుండా రైతుల్లో దళారు చేతిలో మోసపోయి తక్కువ ధరకు అమ్ముకోవడం జరిగిందన్నారు. ఉచితపంటల బీమా కల్పించకపోవడం దారుణం అన్నాడు. కోటమ్మ ప్రభుత్వంలో అన్నదాతలకు ఖర్చు పెరిగి ఆదాయం తగ్గడంతో రైతులు అప్పుల పాలయ్యారన్నారు. ఇటీవల వెంకటాచలంలో మృతి చెందిన అల్లూరు మోహన్ కుటుంబ సభ్యులను కాకాని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ ఉపాధ్యక్షులు వెంకటశేషయ్య. పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో లెండి కాలేజీ విద్యార్థులు ప్రతిభ



**విడవలూరు, నవంబర్ 24ప్ర భాత వార్త:** మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేర యువ భారత్ బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు ఎంపీడీవో నగేష్ కు మారి ఆధ్వర్యంలో నిర్వ హించారు. యువతి యువ కులకు ఎంతో ఉత్సా హంగా ఏర్పాటు చేసిన క్రీడా పోట ీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో కొడవలూరు మం డలం నార్త్ రాజుపాలెంలో ఉన్న సాయి లెండి డిగ్రీ కాలేజీ విద్యార్థులు మరియు శశికాంత్ రెడ్డి జూనియర్ కాలేజీ విద్యార్థులు జట్టు విభాగానికి వాలీబాల్ లో పురుషులు మొదటి స్థానం కైవసం చేసుకోగా, వ్యక్తిగత విభాగానికి 100మాట్స్ రన్నింగ్ విభాగం లో మొదటి, రెండవ మరియు మూడవ స్థానాలను కైవ సం చేసు కోగా, షాట్పుట్ విభాగంలో మొదటి, మూడవ స్థానాలను కైవసం, కోకో విభాగంలో రన్నర్ గా నిలిా రు. కళాశాల కరస్పాండెంట్ శశికాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## రైతన్న మీకోసం అనుబంధ ఆన్లైన్ నమోదు



**విడవలూరు, నవంబర్ 24 ప్రభాతవార్త :** మం డలంలోని ఉన్న రైతు సేవ కేంద్రాల యొక్క పరిధిలో వ్యవసాయ, అనుబంధ రం గాల రైతులకు రైతన్న ఆన్లైన్ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీలక్ష్మి తెలి పా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతన్న మీ కోసం కార్యక్రమం ద్వారా ఆన్లైన్లో సులువుగా తెలుసు కోవడం జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యక్ర మంలో గ్రామస్థాయిలో ప్రధాన నాయకులు, ప్రోగ్రెసివ్ రైతులు పాల్గొన్నారు.

## నేడు విజయగణపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

**బిట్రగుంట నవంబర్ 24(ప్రభాతవార్త) :** కావలి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జిరామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అనారోగ్య కారణాలతో శస్త్రచికిత్స చేసుకున్న కారణంగా ఆయన త్వరగా కోలుకోవాలని ప్రజా జీవితంలో పాలుపంచుకోవాలని కోరుకుంటూ మంగళవారం బోగోలు బజారు సెంటర్ లో విజయగణపతి దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మండల వైసీపీ కన్వీనర్ ఎం. వీరరఘు చెప్పారు. కావలి నియోజకవర్గంలో ఆయన సేవలు మరింత మెరుగుగా అందుకోవాలని కోరుకొంటూ నిర్వహించే ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న వైఎస్ఆర్సిపి అభిమానులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి శ్రేయోభిలాషులు అందరూ పాల్గొనవలసిందిగా కోరారు.

## కాకాణిని వెంటనే అరెస్ట్ చేయాలి - పొదలకూరు సీఐకు ఫిర్యాదు చేసిన టిడిపి నాయకులు



**పొదలకూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని అస్యభకర పదజాలంతో, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ సోమవారం సాయంత్రం పొదలకూరు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పోలీసు స్టేషనుకు చేరుకొని సీఐ శివరామకృష్ణారెడ్డికి రిపోర్టు అందేశారు. శాంతి, భద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాకాణిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు, పీఏసీఎస్ మస్తాన్ బాబు మాట్లాడుతూ అధికారం చేపట్టినప్పటి నుంచి అభివృద్ధి సంక్షేమంపై దృష్టిపెడ చేస్తుంటే ఓర్వలేని కాకాణి ఇష్టం వచ్చినట్లు బెదిరించడం, అసభ్యకర దూషణలు చేస్తున్నాడన్నారు. తామే తలుచుకొంటే కాకాణి సొంత మండలమైన పొదలకూరులో కూడా తిరగనీవ్వమని హెచ్చరించారు. గతంలో కూడా పలుమార్లు అసభ్య దూషణలు చేశాడని, లింగంపల్లిలో టీడీపీ కు ఓటేస్తే గ్రామంలో తిరగనివ్వం, గుడ్డలూడదీ కొడతామని సంస్కారం లేని పదజాలం వాడిన కాకాణి ప్రజాజీవితానికి పనికిరాడన్నారు సొంత మండలాన్ని కాకాణి గాలికి వదిలేస్తే తమ నాయకులు సోమి రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రూ.1.50 కోట్లు సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి పేదలకు ఉపయోగపడే డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, రైతులకు సాగు నీటి కాలువలు, గ్రామాలకు రోడ్లు వేయించారని, ఎస్సీ బాలికల వసతిగృహాల్లో అన్నీ సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు కలిచేటి ప్రభాకర్ రెడ్డి, బొద్దులూరు మల్లిఖార్జున్ నాయుడు, కోడూరు భాస్కర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నం, జమీర్, బక్కయ్య నాయుడు, పి కృష్ణ, అనీల్ అరుణమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులు వృద్ధులుగా మారకముందే ఉద్యోగమా లేక పరిహారమా...?

**– బిజెపి నేత మిడతల రమేష్**



**నెల్లూరు కలెక్టరేట, నవంబర్ 24, ప్రభాతవార్త** : రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం తీర్పును గౌరవించి మూడవ జాబితాను త యారు చేయలని తెలుగు గంగ ఎస్ఈ సు బ్రమణ్యేశ్వర శర్మకు బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. కండలేరు భూ నిర్వాసితులలో సుమారు 1500 మంది తమ అవార్డులను ఉద్యోగాల జాబితాలో చేర్చుకోలేకపోయారు. జీవోల ప్రకారం అవార్డు పొందిన సంవత్సరంలోపు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉన్న నిబంధనపై హైకోర్టు ధర్మాసనం డివిజనల్ బెంచ్ తుది తీర్పు ప్రకటించింది. భూమిని తల్లి లాగా భావిస్తారు. అటువంటి భూమిని జలాశయం అవసరాలకు ప్రభుత్వం తీసుకున్నప్పుడు చేసిన వాగ్దానాలు తప్పక అమలు చేయాలని పేర్కొంది. జీవో నెంబర్ 98 ప్రకారం ఇంటికొక ఉద్యోగం ఇవ్వాల్సి ఉంది. జలవనరుల శాఖలో తెలుగు గంగలో నిర్వహణ కొరకు 300 మంది సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. ఆ నియామకాలు తప్పనిసరి చేయాలి.అవార్డుదారులు వృద్ధులుగా మారకముందే ఉద్యోగమా లేక పరిహారమా నిర్ణయం చేయాలని రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందికట్ల రాజేశ్వరి. నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, బుధవారపు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా ప్రజా పరిషత్ ఏడు స్థాయి సంఘ సమావేశాలు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** : నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశంలో ఈ నెల 25వ తేది మంగళవారం నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ ఏడు (07) స్థాయి సంఘ సమావేశములను జరుపునట్లు జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘంకు ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవ సాయ విద్య, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, సాంఘీక సంక్షేమ విషయాలపై చర్చించనున్నారు. జడ్పీ సీఈఓ శ్రీధర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## అన్నదాత సుఖీభవ ఇంటింట ప్రచారం



**ఆత్మకూరు,నవంబరు24ప్రభాతవార్త** : ఆత్మకూ రు మున్సిపల్ పరిధిలోని 1వవార్డు అయిన ము స్తాపురం, 2వవార్డు అయిన వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో ఈకార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో ప్రతి రైతును అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రతి గడపకు చేరుకొని రైతులకు కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అన్నదాత సుఖీభవ రెండవ విడత ప్రయోజనాల గురించి టిడిపి నాయకులు రైతులకు వివరించి రైతుల నీటిపారుదల విషయం, ఎరువుల వాడకం, వ్యవసాయ పరికరాలపై , 2వ విడత అన్నదాత సుఖీభవ రైతులకు బ్యాంక్ అకౌంట్లో నగదు పడిందో లేదో అన్న విషయాల గురించి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 50వేల రూపాయల చెక్కును అందజేసిన 'కంచి '



**ఆత్మకూరు ,నవంబరు24ప్రభాతవార్త:** శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వర్‌రెడ్డి ఆత్మ కూరు మున్సిపల్ పరిధిలో మృతిచెందిన వారి కర్మకా ండలకు వారి వారి కుటుంబ సభ్యులకు ఒక్కొ క్కరికి 10వేల రూపాయల వంతున 5కుటుంబాలకు 50వేల రూపాయలను సోమవారం విరాళంగా అందజేశారు. 1వార్డులోని మేకల సుబ్బరామయ్య కుటుంబానికి, కరేటి అంకయ్య కుటుంబానికి,13వ వార్డు లోని కొండా చిన్నకొండమ్మ కుటుంబానికి, 22వ వార్డులోని దావా పరంధామయ్య కుటుంబానికి 23వ వార్డులోని నంబూరు లక్ష్మమ్మ కుటుంబానికి ఒక్కొక్కరికి 10వేల రూపాయల వంతున 5కుటుంబాలకు 50 వేల రూపా యలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన ఆయా కుటుంబాలను స్వయంగా పరామ ర్శించి వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభునయలు తదిత దరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌డేకు దుమ్మా కొడుతున్న అధికారులు

**బిట్రగుంట నవంబర్ 24 ప్రభాతవార్త** : బోగోలు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాపరిస్కారవేదిక (గ్రీవెన్స్ డే)కు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావల్సి ఉండగా మొక్కుబడిగా కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరు అవుతున్నారు.దీంతో ప్రభుత్వలక్ష్యం నెరవేర టంలేదు. సమస్యలు చెప్పుకొందామని వెళ్లిన అర్జీదారులకు నిరాశే మిగులుతోంది. ఇక చేసిదిలేక అర్జీదారులు ఇటు కావలి డివిజనల్, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు వ్యయప్రయాసలకు గురై పరుగులుతీస్తున్నారు. ఇకనైనా గ్రీవెన్స్‌డే రోజు మండల స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండే విధంగా ఉన్నతధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

## ఐసీడీఎస్ ప్రాజెక్టుకు చేరుకున్న ప్రీ స్కూల్ కిట్లు



**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త** : పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మరింత ఆట పాటలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కిట్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసీడీ ఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కిట్లలో చిన్నారులకు ఉపయోగపడే అనేక వస్తువులు ఉండడంతో ఇవి ఉపయోగించి అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు ఎక్కువమంది చేరే అవకాశం కూడా ఉంటుంది. ఈ దిశగా సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీ పార్కులో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జాతీయ సేవా కార్యక్రమాలు



**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త** : కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం వైకేఆర్ అండ్‌కే ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు సంబ ంధించి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం జోరుగా సాగు తుంది. ఈ సం దర్భంగా కళాశాల విద్యా ర్థులు గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమా న్ని హుషారుగా చేపడు తున్నారు. ఇందులో గ్రామస్తులు కూడా తమవంతు సహకారం అందిస్తూ ఈ కార్య క్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ రామ్‌ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్, రామాంజనేయులు, అధ్యాపకులు డాక్టర్ శ్యామలకుమార్, డాక్టర్ సురేంద్ర, ఎం. మధుసూదన్‌రావు, ఎం. జాన్‌పాల్, తదితరులు ఉన్నారు.

## రెవిన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మనుబోలు నవంబర్ 24 ప్రభాతవార్త** : ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో కూడా మండల రెవిన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో లేకపో వడం అత్యంత బాధాకరమని మనుబోలు బిజెపి మండల అధ్యక్షులు వాసిరెడ్డి రామిరెడ్డి విమర్శి ంచారు.ప్రజలు తమ సమస్యలతో తహసిల్దారు కార్యాల యం చుట్టు పదే పదే తిరగలేక చెప్పులు అరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది పరిపాలనలో తీవ్రమైన లోపంగా కనిపిస్తుందని రైతులకు యూరియా సరఫరా భూమస్యల పరిష్కారం వంటి ముఖ్య మైన అంశాలో రెవిన్యూ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తే దాని పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం సన్నగిల్లుతుందని అధికారులు తమ బాధ్యతలను గుర్తు చేసుకొని ప్రజా పక్షంగా పనిచేయాలని కోరారు. ఈవిషయాన్ని మా ప్రియత మనాయకులు,సర్వేపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి తగిన చర్యలు చేపట్టేలా కోరుతున్నారు. రాబోయే డిసెంబర్ నెలలో మనుబోలులో బిజెపి మండల కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉంటు వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాడతామని మాకార్యకర్తలకు ప్రజలకు హామి ఇస్తున్నామన్నారు.ఈ సందర్భంగా అధికారులంతా తమ విధులను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించి ప్రజల మనోభావాలకు అణుగుణంగా స్పందించాలని కోరారు.

## దొంగ పట్టాలు సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నాడు

**– చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేసిన పెరుమాళ్ళపాడు గ్రామస్తులు**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** : నెల్లూరు జిల్లా చేజర్ల మండలం పెరుమాళ్ళపాడు గ్రామానికి చెందిన తలపనేని జయంతులు డి నమూనా పట్టా పేరుతో దొంగ కాగితాలు సృష్టించి ఇంటింటికి సరఫరా చేస్తున్నాడంటూ పెరుమా ళ్ళపాడు గ్రామస్తులు సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం అంద జేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దొంగ పట్టాలు సృష్టించి మీకు ఎలాగైనా పంచాయతీ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే ఈ పొలాలు మీకు అందేలా చేస్తా నని మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకు వచ్చి ఇలాంటి మోసపూరితమైన మాటలు చెప్పి ప్రభుత్వ రెవెన్యూకి సంబంధించిన స్టాంపులు సంత కాలు దొం గవి సృష్టించి ఇలా చేయడం చాలా దారుణమని ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం అందజేయడం జరిగింది. వెంటనే సదరు ఎమ్మార్వోకి ఈ విషయం తెలియపరచి విచారణ చేయమని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం మాకు చాలా ఆనందంగా ఉందని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకోవాలని మేము ఈ సందర్భంగా తెలియజేస్తున్నా మంటూ తెలిపారు. ఈ కార్యక్ర మంలో నెల్లూరు జిల్లా చేజర్ల మండలం పెరుమాళ్ళ పాడు గ్రామస్తులు అయిన కిలారి జయరామయ్య, వేమన మహేష్, కోనంకి వెంకటేశ్వర్లు, బొర్ర వెంకటేశ్వర్లు, చంద్ర శ్రీనివాసులు, షేక్ ఫరీద్ భాష, షేక్ నన్నే భాష, షేక్ ఖాదర్, మస్తాన్, షేక్ ఖాదర్ బాషా, షేక్ గౌస్ బాషా, భూలోకం చిన్నయ్య మంచాల పెంచలయ్య, అరిగి పెంచలయ్య, ఎల్లంటి చినపెంచలయ్యలు పాల్గొన్నారు.

## క్రీడా దుస్తులు బహుకరణ



**ఇందుకూరుపేట, నవంబర్ 24, ప్రభాతవార్త** : ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని హైసూ క్ల్ నందు జడ్ ఆర్ఆర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన 2014-15 బ్యాచ్ విద్యార్థులు నాటి ఈదూరు పాఠశాలలో హిందీ బోధించిన స్వర్గీయ మారుతీ దేవి జ్ఞాపకార్థం 30 క్రీడా దుస్తులు రూ. 13500 విలువ కలిగినవి బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 2014-15 10వ తర గతి ఈదూరు విద్యార్థులు సీహెచ్ గిరీష్, కే.సాయి కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు క్రీడా దుస్తులు బహుకరించిన ఈదూరు విద్యా ర్థులను ధన్యవాదాలు తలెఇపారు. వ్యాయమ ఉపాధ్యాయులు షేక్ ముజీర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## రైతు సమస్యలపై అధికారులకు అర్జీలు



**ఆత్మకూరు ,నవంబరు24ప్రభాతవార్త** : రైతు సమస్యలపై ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండ లాల రైతు సంఘం నాయకులు, రైతులు అధికారులకు సోమవారం అర్జీలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ నులు ప్రారంభమవుతున్న దృష్ట్యా చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో రైతులకు ఉపయోగకరంగా పనులు చేపట్టాలని వారు కోరారు. పలు ప్రాంతాల్లో భూముల సర్వేకూడా చేపట్టాలన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు వీరికి హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో ఆత్మకూరు మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాపిశెట్టి కృష్ణమోహన్, లక్కు కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, విజయ్‌కుమార్, ఏఎస్‌పేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, దిలియాజ్‌బాషా, మండల కమిటీ సభ్యులు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం



**నెల్లూరు రూరల్, నవంబర్ 24, ప్రభాతవార్త** : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని సౌత్ మోపూరు, మొగళ్లపాలెం గ్రామాల్లో నేడు నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రూరల్ నియోజకవర్గంలోని ప్రతి రైతు వరకు యూరియా సరఫరా సజావుగా కొనసాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని, ముఖ్యమంత్రి నాయకత్వంలో రైతుల పంట భారం తగ్గించేందుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఇప్పటికే రెండు విడతలుగా నగదు అందజేశామని ఆయన గుర్తు చేశారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్,మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, వైస్ చైర్మన్ రాపూరు చంద్రశేఖర్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, ఎంపీటీసీ చెంచమ్మ, ఉప సర్పంచ్ చల్లా నరసయ్య, మండల ఇన్‌ఛార్జి వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి జలదంకి సుధాకర్‌తో పాటు పలువురు టీడీపీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## చెత్త ఇలా పడేస్తే ఎలా?




**బిట్రగుంట నవంబర్ 24 ప్రభాతవార్త** : బోగోలు మేజర్ పంచాయతీ లో పారిశుధ్యంపైన పాలకులు, అధికా రులు అశ్రద్ధ కనపరుస్తున్నారని ప్రజలు ఆవేదన చెం దుతున్నారు. బోగోలు దళితవాడ లో సుమారు నెల రోజులకు పైగా చెత్త తీయటం లేద న్నారు. దీంతో ప్రజలు దుర్గంతో అల్లాడి పోతున్నారు. దీనివల్ల అంటు వ్యాధులు ప్రబలు తాయని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు.

## శివాలయంలో హుండీ ఆదాయం రూ. 2,29,368



**పొదలకూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** : పొదలకూరు పట్టణంలోని పురాతనమైన శ్రీ కామాక్షితాయి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సి హెచ్ శ్రీనివాస్ బాబు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో 8 నెలలకు గాను దేవస్థానానికి అక్షరాల రెండు లక్షల ఇరవై తొమ్మిది వేల మూడు వందల అరవై ఎనిమిది రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ప్రసాద్ రెడ్డి, ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సుధాకర్,ఆలయ అర్చకులు కుమార్ స్వామి, సిబ్బంది కుమార్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## రామలింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన

**మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి**



**తోటపల్లి గూడూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** : మండలంలోని ఈదూరు గ్రామానికి చెందిన కోడూ రు సుగుణమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెం దిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం రామలింగారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులు రామలింగారెడ్డి, ఆయన కుమారుడు సతీష్ రెడ్డి తదితరులతో మాట్లాడిన నేతలు సుగుణమ్మ మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సమయంలో కుటుంబం ధైర్యంగా ఉండాలని సూచిస్తూ అవసరమైన సహాయానికి తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు మాజీ మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మన్యం సుబ్రహ్మణ్యం గౌడ్, ఆకుల మధుసూదన్ గౌడ్, మన్యం చిరంజీవులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు కూడా కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## జిల్లా స్థాయిలో జరిగిన చెకుముకి పరీక్షలో లుంబిని విద్యార్థుల ప్రతిభ



**చేజర్ల నవంబర్ 24 ప్రభాతవార్త** జిల్లా స్థాయిలో జన విజ్ఞాన వేదిక వారు నిర్వహించిన చెకుముకి ప్రతిభా పరీక్షలో లుంబిని విద్యాలయం విద్యా ర్థులు ఆదివారం ప్రతిభ చాటారు. ఈ సంద ర్భంగా ప్రతిభా పరీక్షలలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్న లుంబిని విద్యార్థులు య. హేమతేజ, ఎన్ .వందన, షేక్.అలీ, అజహ ర్‌లు సత్తా చాటారు. విద్యార్థులకు మెమొం టోలు అందజేశారు. విద్యార్థులకు ప్రతిభ అభినందనలు తెలిపుతు లుంబిని యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయనీ,ఉపాధ్యాయులు అభినందించారు.

## రైతులకష్టాలు తెలుసుకొనేందుకే రైతన్న మీకోసం



**బిట్రగుంట నవంబర్ 24 ప్రభాతవార్త** : ప్రతి రైతును కలిసి వారి కష్టాలను తెలుసుకొనేందుకే రైతన్నా మీకోసం అనే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం రూపొం దించి ందని మం డల టీడీపీ కన్వీనర్ ఎం. నాగేశ్వరావు పేర్కొ న్నారు. బోగోలు మండలం విశ్వనాథరావ పేట పంచాయతీ లో సోమవారం మం డల వ్యవసాశాఖ అధికారిణి శైలజతో కలిసి రైతుల ఇంటివద్దకు వెళ్లి వారి సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ క్రింద ఇప్పటివరకు రెండు దఫాలుగా 7000 రూపాయలు రైతుల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. అంతే కాకుండా రైతులకు యూరియా కొరత లేకుండా ఎకరానికి మూడు దఫాలుగా ఒక్కొక్క బస్తా చొప్పున యూరియా అందిస్తున్నామని చెప్పారు.సాగునీటి విషయంలోను స్థానిక శాసన సభ్యులు దగమాటి వెంకట కృష్ణారెడ్డి ప్రత్యేక శ్రద్ధకనపరుస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి శైలజ, యసి డైరెక్టర్ ఎల్. సుధీర్‌బాబు,వ్యవసాయ శాఖ సహాయకులు గాంధీ, రెవిన్యూ శాఖ కార్యదర్శి రామమోహన్ రావు, రైతులు ఇందూపూరు.తిరుపతి రెడ్డి, చిలకా జానకిరామయ్య, తోట. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## అధికారులు చేనేతలను అవమానించి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీశారు

**– బిజెపి నేత మిడతల రమేష్ – కలెక్టర్ కార్యాలయం ఎదుట బిజెపి నేతలు ధర్నా**



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** : సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బిజెపి నేతలు చేనేతలు కార్మికులకు అన్యాయం జరిగిందంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తుఫాన్ సాయం ఇవ్వక పోవడమే కాకుండా బియ్యం కోసం మగ్గం గుంటలు నిర్మిం చారంటు అధికారుల పేర్కొనడానికి నిరస నగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందని బిజెపి నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, చేనేత ఐక్యవేదిక కన్వీనర్ బుధవారపు బాలాజీలు ధర్నానుద్దేశించి మాట్లాడారు. వరుస వర్షాలకు తుఫాన్లకు నూలు డిజైన్ అట్టలు మెత్తబడి గుంటలలోకి నీరు చేరి రోజువారి ఉపాధిని చేనేతలు కోల్పోయారని వారికి తుఫాన్ సాయం అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లాలో నారాయణరెడ్డిపేట, పొదలకూరు, తాటిపర్తి, మడమనూరు, గుమ్మల్ల దిబ్బ లాంటి పలు ప్రాంతాలలో చేనేతల వివరాలు సేకరించడంలో అధికారులు విఫలమయ్యారు. కరెంటు మీటర్ నేతన్న పేరు మీద లేదని, వర్షాలు సమయంలో వేరే పనికి పోయారని. మేము చూసినప్పుడు మగ్గం మీద పనిలో లేరని కారణాల చూపడాన్ని బిజెపి నేతలు చేనేత నేతలు తప్పు పట్టారని తుఫాన్ బాధితులను ఆదుకోమని ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చిన జిల్లా అధికారులు బియ్యం కోసం నేతన్నలు ఆరాటపడుతున్నారంటూ ఎద్దేవా చేయడానికి అవమానించడమేనని ధర్నాలో నేతలు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పముజుల సురేష్, చింత గింజల సుబ్రహ్మణ్యం, సోమ గోపాల్, రామసుబ్బయ్య, కారంపూడి మోహన్, దొనేపూడి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభం



**తోటపల్లి గూడూరు, నవంబర్ 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ మత్స్య సహాయకులు, గ్రామ పశుసంవర్ధక సహాయకులు ఇంటి ంటికీ వెళ్లి రైతులను సంప్రదించి కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ సాగు, ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధి వంటి అంశాల ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మద్దతు గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటూ సర్వే నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి శిరీష రాణి వరిగొండ గ్రామ సహాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం అనే నినాదాన్ని రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం పై దృష్టి పెట్టాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రతి రైతుకు అన్నదాత సుఖీ భవ



**మనుబోలు నవంబర్ 24 ప్రభాతవార్త** : మండల కేంద్రమైన మనుబోలు రైతులకు అన్నదాత సుఖీభవ జమ అయిందా లేదా అంటు వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఈనెల 29 వరకు జరుగుతుందని ఆయన మీడియాకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం రైతులకు వివరించారు. అన్నదాత సుఖీభవ రైతుల ఖాతాల్లో రెండో విడత జమ చేయడం జరిగిందని పేర్కున్నారు. అన్నదాత సుఖీభవ అందని రైతులను గుర్తించి వారికి కూడా అన్నదాత సుఖీభవ జమైనట్లు చర్యలు తీసుకు ంటామని హామి ఇచ్చారు. అన్నదాత సుఖీభవ సర్వే రైతులను రాజు చేయాలనే ముఖ్య ఉద్దేశంతో రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారని తెలిపారు. ఈకార్యక్రమంలో పచ్చి పాల రామిరెడ్డి, చేరెడ్డి పద్మనాభరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, రమేష్‌రెడ్డి, చల్లగిరి ప్రసాద్,సాని వెంకట రమణయ్య, రాజాగౌడ్, దనుంజ యరెడ్డి,బండి కట్టు రకి,పెనుమాక మహేష్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ. కమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 29నుండి రైతన్న మీకోసం



**సీతారామపురం నవంబర్ 24 ప్రభాతవార్త** : మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం నుండి 29 వరకు రైతన్న మీకోసం కార్యక్ర మం చేపట్టామని మండల వ్యవసా యాధికారి టి .చెన్నారెడ్డి తెలిపారు.సోమవారం బసినేనిపల్లి గ్రామంలో రైతుల ఇంటి వద్దకు వెళ్ళి ప్రభుత్వ పథకాలను వివరించారు. వ్యవసాయాన్ని లాభ సాటిగా మార్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాలు రైతుల ఇండ్ల వద్దకు వెళ్ళి వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు .రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు.ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## డిసిపల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన

**మర్రిపాడు, నవంబరు24ప్రభాతవార్త** : మర్రిపాడు మండలంలోని డిసిపల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం వాహనదారులకు ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులచే ప్లకార్డులు ఏర్పాటు చేసిపలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతిఒక్క వాహన దారుడు నియమాలను పాటిస్తూ వేగాన్ని తగ్గించి వాహనాలను నడపాలన్నారు మద్యం సేవించి వాహనాలను నడిపితే వారిపై తగుచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా లైసెన్సులు పొంది ఉండాలన్నారు. దీంతోపాటు జాతీయరహదారి వెంబడి ఇష్టారాజ్యంగా వాహనాలను నిలిపివేయరాదని రాములు తెలిపారు.

## పొదలకూరులో రైతన్నా మీకోసం కార్యక్రమం



**పొదలకూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** : మండల పరిధిలోని తాటిపర్తి, మహమ్మదపురం మరియు విరువూరు గ్రామలలో పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివ నాయక్ మరియు మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ రైతన్నా మీకోసం వారం రోజుల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మాట్లాడుతూ ప్రభుత్వము ఈ నెల 19వ తేదీన విడుదల చేసిన అన్నదాత సుఖీభవ మరియు ప్రధాన మంత్రి కిసాన్ లబ్ధి పొందిన రైతు కుటుంబాలను కలవడం జరిగినది. అదేవిధంగా రైతన్నా మీకోసం కార్యక్రమంకు గాను ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో మూడు బృందాలుగా ఏర్పడి అన్నదాత సుఖీభవ మరియు ప్రధాన మంత్రి కిసాన్ పొందిన లబ్దిదారుల కుటుంబాలకు వెళ్లి, నగదు అందుతుందో లేదో అని తెలుసుకొని. ప్రభుత్వ పథకాల పై కొన్ని వివరాలు సేకరించి, సేకరించిన వివరాలను యాప్ నందు నమోదు చేయుట జరుగుతుందన్నారు. అదే విదంగా ముఖ్యమంత్రి సందేశం రైతులకు చదివి వినిపించుట జరుగుతుందన్నారు. ఈ మూడు బృందాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ మత్స్య సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు, గ్రామ పశు వైద్య సహాయకులు నాయకత్వం వహిస్తారు. గ్రామ సచివాలయం పరిధిలోని అందరూ అధికారులు పాల్గొని, రైతుల వివరాలు సేకరించుట జరుగుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి, మండల పశు వైద్య అధికారి మరియు ఉద్యానవన అధికారి పర్యవేక్షిస్తారు. అందరూ రైతులు ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన తెలిపారు.

## నూతన జిల్లా పంచాయతీ అధికారిగా డి వసుమతి



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** నూతన జిల్లా పంచాయతీ అధికారిగా డి.వసుమతి, డిడిఓ, సోమవారం పూర్తి అదనపు బాధ్యతతో స్వీకరిం చారు. జిల్లా పంచాయతీ అధికారిగా ఉన్న శ్రీధర్ రెడ్డి జిల్లా సీఈఓ ఇంకా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో డిడి ఓగా విధులు నిర్వహిస్తున్న డి వసుమతి జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.

## విపిఆర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ సీఈవో



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను నూతన జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆయనను జిల్లా పరిషత్‌కు కొత్త సీఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపధ్యంలో సోమవారం నగరంలోని విపిఆర్ నివాసానికి వచ్చిన ఆయన విపిఆర్ దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించాలని సూచిం చారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అభివృద్ధి వైపు రూరల్ ఎమ్మెల్యే దృష్టి



**నెల్లూరు రూరల్, నవంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మొగళ్లపాలెం గ్రామంలో చంద్రన్న విద్యుత్ వెలుగులు కార్యక్రమాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పక్రియలపై దృష్టి పెట్టి పని చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధంరెడ్డి తెలిపారు. రూరల్ ప్రాంతంలో మొత్తం 26 ప్రాంతాల్లో చేపట్టిన 3 ఫేజ్ కరెంట్ పనుల్లో 19 ప్రాంతాల్లో పనులు పూర్తిగా ముగిశాయని, మిగిలిన 7 ప్రాంతాల్లో పనులు పూర్తై ఛార్జింగ్ దశలో ఉన్నాయని చెప్పారు. ఆ ప్రాంతాలకు త్వరలోనే విద్యుత్ సరఫరా ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. నెల్లూరు రూరల్ అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అందిస్తున్న సహకారానికి రూరల్ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, నెల్లూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, వైస్ ఛైర్మన్ రాపూరు చంద్రశేఖర్, జడ్పీ కోఆ ప్షన్ మెంబర్ అల్లాబక్షు, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ, ఉప సర్పంచ్ చల్ల నరసయ్య, మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి సుధాకర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీకి నెల్లూరు జిల్లా నుండి 9 వినతులు



**నెల్లూరు, నవంబర్ 24, ప్రభాతవార్త –వైద్యం** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నుండి 9 వినతులు అందినట్లు ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం జరిగింది. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా నెల్లూరు జిల్లా వినియోగదారులు విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్ మార్పు కాలిపోయిన/ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లోఓల్టేజి సమస్య, ట్రాన్స్‌ఫార్మర్‌ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు వీటిలో ఉన్నాయి. ఈ అంశాలపై వారికి సీఎండీ శివశంకర్ లతోటి సమాధానమిస్తూ వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నెల్లూరు నుంచి 9 వినతులు ఉన్నాయని వివరించారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపతామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా 1800 425 155333 కు కాల్ చేయడం లేదా వాట్సప్ నెంబరు 9133331912 కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ), పి.ఆయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డి) కే.గురవయ్య, డైరెక్టర్ రామోహన్‌రావు, జానకిరామ్, రమణాదేవి, శోభావాలెంటీనా, ఆదిశేషయ్య, మురళీకుమార్, ఎం.ఉమాపతి, పి.సురేంద్ర నాయుడు, జనరల్ మేనేజర్లు కృష్ణారెడ్డి, రామచంద్రరావు, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, విజయన్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**వింజమూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రతినిత్యం పాటుపడుతూ రైతును రాజును చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బుక్కాపురం పంచాయతీ పరిధిలో చంద్రపడియ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతు లు హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ నేతలు వ్యవసాయాధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం రైతులు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ అందిన రైతులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మన మంచి ప్రభుత్వం అని, రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా ప్రతి రైతు ఖాతాలో రూ.14000 జమ చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6వేలు అందించగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతన్నలకు రూ.20వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 12 సొసైటీలు ద్వారా రూ.270 రూపాయలకే యూరియా బస్తా అందించడం జరుగుతుందన్నారు. యూరియా కొరత లేదని వైసీపీ ఫేక్ ప్రచారంతో లేని యూరియా కొరతను సృష్టిస్తున్నారన్నారు. ఇలా అసత్య ప్రచారం చేసే వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న 149 చెరువుల్లో ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావంలో పుష్కలంగా నీరు చేరిందన్నారు. చెరువులో నీరు చేరడంతో రైతులు ఉత్సాహంగా పంటలను సాగు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించే పంటకు మద్దతు ధర కల్పిస్తూ వెన్ను దన్నుగా నిలుస్తుందన్నారు. బిందు సేద్యం చేసే రైతులకు 90శాతం ఆయితీ అందించి వారికి అవసరమైన డ్రిప్ పరికరాలను అందిస్తుందన్నారు. అలాగే సబ్సిడీపై మేలైన విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలలో అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ ద్వారా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి రైతుకు సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. అనంతరం గ్రామం నుండి ఆత్మకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వెళ్లి మహిళలతో ఉచిత ప్రయాణం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను చంద్రపడియ బుక్కాపురం రైతులు పూలమాలతో శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, మండల ఇన్‌చార్జి అధ్యక్షులు ఆనంగి రమణయ్య, సొసైటీ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి చేబ్రోలు వసంతరావు, కో క్లస్టర్ ఇన్‌చార్జి పాములపాటి మాల్యాద్రి, సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాటం రమణారెడ్డి, నాయకులు వేమూరి దొరస్వామి నాయుడు, మంచాల శ్రీనివాసులునాయుడు, కీస్తిపురం సర్పంచ్ దాతట్ల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ దాట్ల కృష్ణారెడ్డి, సొసైటీ డైరక్టర్లు కోడూరు నాగిరెడ్డి, గని శ్రీనివాసులు నాయుడు, దుద్దుగుంట బోరెడ్డి, అజరత్‌రెడ్డి, వేమూరు లక్ష్మీ నారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ శేషగిరి, ఏవో వాసు, హార్టికల్చర్ అధికారి షకీల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్, వీఆర్వో మీరావలి, పంచాయతీ కార్యదర్శులు రామారావు, జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రామసాగరం సచివాలయం పరిశీలన



**సైదాపురం, నవంబర్ 24, ప్రభాతవార్త** మండల పరిధిలోని రామసాగరం గ్రా మంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీవో ఎంవీ రామ్మోహన్‌రెడ్డి సోమవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను, రికార్డులను తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఈకేవైసీ, కౌసల్యం, మాండేటరి, బయోమెట్రిక్ అప్డేట్, రైతన్న మీ కోసం సర్వేలపై తగిన సూచనలు ఆయన అందించారు.

## అంజనేయ స్వామి ధర్మధ్వజాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, నవంబరు 24 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం రుద్రకోట అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం కావలి ఎమ్మెల్యే స్వామి వారి భక్తుడు మూలంరెడ్డి కామేశ్వర రెడ్డి విరాళంతో ఏర్పాటు చేసిన శ్రీ అంజనేయ స్వామి వారి ధర్మధ్వజాన్ని ప్రారంబిం చారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, అర్చకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సత్కరించడం జరగింది. అయ్యప్ప స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే దగు మాటి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించడం జరిగింది. కావలి నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో వుండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ట్రస్ట్ సభ్యులు, నాయకులు, గ్రామస్తులతో కలసి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నూతన గోశాల నిర్మాన పనులను పరిశీలించారు. అవసమైన మార్గ నిర్దేశం చేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పలు సూచనలు చేస్తూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ట్రస్ట్ సభ్యులు, మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దుగుమాటి వ్యక్తిగతంగా రూ. ఐదు లక్షలు రూపాయిలు విరాళం అందించారని, ఆ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం కొనసాగుతున్నదని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు ట్రస్ట్ సభ్యులు, ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.

## మొగళ్లపాలెం గ్రామంలో టీడీపీలో భారీగా చేరిక

### - కండువా కప్పి ఆహ్వానించిన రూరల్ ఎమ్మెల్యే



**నెల్లూరు రూరల్, నవంబర్ 24, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. రూరల్ నియోజకవర్గంలోని మొగళ్లపాలెం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు నేడు పార్టీ అధికారిక విస్తరణ కార్యక్రమంలో టీడీపీలో చేరి పార్టీకే బలం చేకూర్చాయి. ఉబ్బల శంకరయ్య, మన్నవరపు మల్లయ్య, బిరుదోలు శీనయ్య, ఏకసిరి చెంచయ్య, కీలుకుప్ప పిచ్చయ్యతో పాటు వారి మిత్రబృందం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు అందుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, అం దరం ఒక్క తాటి మీద పని చేస్తూ అభివృద్ధి దిశగా నడుద్దామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనపై నమ్మకం పెంచుకుని పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. భవి ష్యత్తులో మరెందరో టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని, పార్టీ బలోపేతం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, వైస్ ఛైర్మన్ రాపూరు చంద్రశేఖర్, జడ్పీ కో - ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ, ఉప సర్పంచ్ చెల్లా నరసయ్య, మండల ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి సుధాకర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవతో రైతుల కళ్లల్లో ఆనందం



**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీ భవ పథకంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివి రుస్తుందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మం డలం లేగుంటపాడు గ్రామంలో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ పరిధిలో రైతు ల ఇళ్లకు వెళ్లి అన్నదాత సుఖీభవ పథకంపై ఆరా తీశా రు. ఈ సందర్భంగా రైతులు అన్నదాత సుఖీభవ నిధు లు తమ ఖాతాల్లో జమ అయ్యాయని చెప్పగా.. ఓ కౌలు రైతు మాత్రం తనకు రాలేదని సమాధా నమిచ్చారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి విషయం తెలియజేస్తానని ఈ సందర్భంగా ఆమె రైతుకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శారద, వ్యవసాయ శాఖ ఏడీ అనిత, తహ సీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీ హరిరెడ్డి, ఏపీఎం సుబ్బరాజు, గ్రామ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, వేగూరు సర్పంచ్ అమ రావతి, మండల పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి,ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, నాగరాజు, ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, పిచ్చిక మధుసూదన్‌రావు, సనత్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బానాయుడు, ఆదాల శివారెడ్డి, బాల రవి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు ఎం. సుధాకర్, జల జీవన్ మిషన్ డైరెక్టర్ విన్నకోట రాధాకృష్ణ, జొన్నవాడ దేవస్థాన ఛైర్మన్ అశోక్‌రెడ్డి, యాకసిరి వెంకట రమ ణమ్మ, శ్రీహరి, చింతలపూడి పెంచలయ్య, పురుషోత్తం, గుత్తికొండ వెంకయ్య, బద్దిపూడి శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో రైతులు ఉన్నారు.

## సెలవు పెట్టినా జీతాలు.. విదేశాలకు వెళ్లినా జీతాలు

### - కోవూరు ప్రాజెక్టులో ఇదీ సంగతి




**కోవూరు, నవంబరు 24 ప్రభాతవార్త :** వాస్తవంగా ఏ శాఖలోనైనా సెలవులు పెట్టినా విదేశాలకు వెళ్లినా జీతాలు వచ్చే పరిస్థితి ఉండదు.. కానీ అందుకు విరుద్ధంగా సెలవులు పెట్టినా.. విదేశాలకు వెళ్లినా జీతాలు మాత్రం టంఛన్‌గా వచ్చే శాఖ కేవలం ఐసీడీఎస్ శాఖ మాత్రమే .. ప్రస్తుతం కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో బుచ్చి , కొడవలూరు, కోవూరు మండలాల్లో ఇటీవల గతంలో కూడా అనేక మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సెలవులు పెట్టినా.. అమెరికా లాంటి విదేశాలకు వెళ్లినా వారందరికీ జీతాలు ఇచ్చే పరిస్థితి నెల కొంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. నియోజకవర్గానికి మండల కేంద్రమైన కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో నెలకొంది. వాస్తవంగా విదేశాలకు వెళ్లాలంటే సంబంధిత అధికారుల అనుమతి తీసు కుని ఎన్నిరోజులు సెలవులు ఇస్తారో అడిగి తీసుకుని వెళ్లాలే తప్ప అటువంటిదేమీ లేకుండా జీతాలు మాత్రం అందించే పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**- మారని సూపర్‌వైజర్ల తీరు** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోవూరు, విడవలూరు, కొడవలూరు, బుచ్చి నాలుగు మండలాలు కలిసి ఉన్నాయి. ఇందులో 365 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నెలకు రెండు సార్లు కేంద్రప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు గానూ ప్రతి నెలకు నిర్వహించే కార్యక్రమాలకు 500 రూపాయలు పారితోషకం ఖర్చులకు గానూ ప్రభుత్వం అందిస్తుంది. కొంతమంది సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలను కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఈ ఇన్సెంటివ్‌లో కూడా కమీషన్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏం చేయాలో పాలుపోక వారికి ఎంతోకంత సమర్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## సైదాపురంలో రైతన్న.. మీ కోసం కార్యక్రమం



**సైదాపురం, నవంబర్ 24, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుల కొరకు చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎస్‌కే పరిధిలో అధికారులు, సిబ్బంది సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ, తదితర శాఖల సిబ్బంది బృందంగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి పంచసూత్రాలపై అవగాహన కల్పించారు. సైదాపురంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి పాల్గొని రైతుల కుటుంబాల వద్దకు వెళ్లి వ్యవసాయశాఖ అనుబంధ పంటలు, వచ్చే లాభాలు, పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌ను రైతులకు ఇన్‌స్టాల్ చేయించారు.

## రైతన్న.. మీకోసం మరో మోసం : మాజీ మంత్రి కాకాణి



**తోటపల్లి గూడూరు, నవంబర్ 24, ప్రభాతవార్త** మండలంలోని ఈదూరు, మాచర్లవారిపాలెం, పర్యటించిన డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి యుద్ధప్రాయంగా కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. రైతులు యూరియా కొరత, నకిలీ విత్తనాల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ప్రభుత్వం మాత్రం రైతన్న మీకోసం పేరుతో ప్రచార కార్యక్రమాలు మాత్రమే చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు రెండేళ్లలో 40 వేల ప్రత్తి ప్రకటించి, కేవలం 10 వేల మాత్రమే ఇచ్చి మిగిలిన వాటిని ఎగ్గొట్టాడని విమర్శించారు. ఉచిత పంటల భీమా రద్దు, ధరల స్థిరీకరణ నిధి లేకపోవడం రైతుల జీవనోపాధిని దెబ్బతీసిందని అన్నారు. ఆర్బీకే వ్యవస్థను బలహీనపరచడంతో, విత్తనం నుండి విక్రయం వరకు రైతులు ఇబ్బందుల్లో చిక్కుకున్నారని ఖండించారు. జిల్లాలో ఏ చోటా రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులు పాల్గొనకపోవడం, రైతుల నిరసనకు నిదర్శనం అని పేర్కొన్నారు. జగనన్న పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, మళ్లీ వ్యవసాయం లాభదాయకంగా మార్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులతో ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఈదూరు, వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు టంగుటూరు పద్మనాభరెడ్డి, తదితరులు ఉన్నారు.

## పెద్దపట్టపుపాలెంలో రైతన్నా మీకోసం కార్యక్రమం లో పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే



**కందుకూరు నవంబరు 24, ప్రభాతవార్త** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్న ప్పటికీ, రైతు సంక్షేమం కో సం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎక్కు వ ప్రాధాన్యత ఇస్తున్నారని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉలవపాడు మండలం పెద్దపటపుపాలెం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి, ఈ ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన పథకాలను కరపత్రాల రూపంలో వివరించారు. ఎమ్మెల్యేమాట్లాడుతూ గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటికే రెండు విడతలుగా, అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతు రథం పథకం ద్వారా ట్రాక్టర్లు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతు భరోసా క్రింద 20 వేలు ఇస్తామని చెప్పి రెండుమూడు విడతల్లో కేవలం 13,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రైతులను పూర్తిగా గాలికి వదిలేయ దంతో, వ్యవసాయరంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు.అలాగే వేట విరామ సమయంలో మత్స్యకారులకు వైసిపి ప్రభుత్వం 10 వేలు మాత్రమే ఇవ్వగా, చంద్రబాబు నాయుడు గారు మత్స్యకార సేవ పేరుతో, ఆ మొత్తాన్ని రెట్టింపు చేశారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. అలాగే మత్స్యకారులకు అన్యాయం చేసేలా జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన 217 జీవోను కూడా రద్దు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులను ఇబ్బంది పెట్టిన విషయాన్ని ఎవరూ మర్చిపోలేరని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎక్కువగా మేలు జరుగుతున్న విషయాన్ని రైతులే స్వయంగా చెబుతుంటే ఆనందంగా ఉందని ఎమ్మెల్యే చెప్పారు.

## శ్రీ మల్లేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.7,90,420



**కావలి, నవంబరు 24 ప్రభాతవార్త** శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించగా హుండీల ద్వారా రూ. 7,90,420 వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ కోవూరు ఇనస్పెక్టర్ నాగమల్లేశ్వర రాజు, దేవాదాయ శాఖ సిబ్బంది సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి అరవ రాధాకృష్ణ, ధర్మకర్త కసవరాజు కృష్ణమోహన్‌లు మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణా రెడ్డి సహకారంతో మొదటి సారిగా భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు 9 హుండీలను జూన్ 5వ తేదిన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు 172 రోజులకు గాను హుండీలలో భక్తులు సమర్పించిన నగదు రూ. 7 లక్షల 90 వేల 420 రూపాయిలు వచ్చినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో జమచేయండం జరిగిందని తెలిపారు. భూమి వేలం పాట ద్వారా, అన్లైన్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని తదితర వాటిపై వచ్చిన వాటిని మొత్తం కలిపి ఒక శేత పత్రాన్ని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు శశిధర్ గురుకుల్, దేవాదాయ శాఖ సిబ్బంది, సేవకులు, ఆఫ్రైజర్ వేమూరి సందీప్, భక్తులు పాల్గొన్నారు.

## సంగం కానిస్టేబుల్ నాగార్జునను అభినందించిన జిల్లా ఎస్పి




**సంగం నవంబర్ 24 ప్రభాతవార్త** ఆర్టీసి బస్సులో మంటలు చెలరేగడంతో గమనించి బస్సు ఆపి ప్రయాణికులను సురక్షితంగా రక్షించిన కానిస్టేబుల్ నాగార్జునను జిల్లా ఎస్పి డాక్టర్ అజిత వెజెండ్ల అభినం దించారు. 18 వ తేది సాయింత్రం సంగం గ్రామ సమీపంలో కానిస్టేబుల్ నాగార్జున విజబుల్ పోలీసింగ్‌చేస్తుండగా ఆత్మకూరు నుండి నెల్లూరు వైపు వెళుతున్న బస్సు యొక్క ముందు భాగంలో సంభవించిన షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు రావడం జరిగింది. సంఘటన జరిగిన ప్రదేశంలోనే పనిచేస్తున్న సంగం కానిస్టేబుల్ నాగార్జున మంటలను తక్షణం గమనించి బస్సును వెంటనే ఆపించారు. బస్సులో ప్రయాణిస్తున్న మొత్తం 45 మంది ప్రయాణికులను త్వరగా సురక్షితంగా బయటకు దింపారు. ప్రయాణికులను మరోక బస్సు ద్వారా నెల్లూరుకి పంపించడం జరిగింది. కానిస్టేబుల్ నాగార్జున చురుకుదనం,ధైర్యం ,తెగువైన చర్యల వల్ల ఒక పెద్ద ప్రమాదం నుండి ప్రయాణికుల ప్రాణాలు రక్షించబడ్డాయి. జిల్లా ఎస్పి కానిస్టేబుల్ నాగార్జునను అభినందించి రివార్డు అందజేశారు.

## కరేడులో 16లక్షలతో సీసీ డ్రైనేజి పనులకు శ్రీకారం



**కందుకూరు నవంబరు 24, ప్రభాతవార్త** గ్రామల్లో మౌళికవసతులు కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో రూ.16లక్షలతో సీసీ డ్రైన్ పనులకు ఆయన శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీల్లో మోలిక వసతులు మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఇందులో బాగంగా కరేడు పంచా యతీలో అభివృద్ధిపనులకు శ్రీకారంచుట్టామ న్నారు. పరిపాలనాదక్షుడైన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథ కాలను పరుగులు తీస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులను దారి మళ్లించిన ఘనత జగన్‌రెడ్డిదేనన్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో మౌళిక వసతుల కల్పనకు అధిక మొత్తంలో నిధులను విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు ఆదాము, పార్టీ నాయకులు పోలుబోయిన శ్రీను, బాలమురళి, రాంబాబు రమణ, వెంకట్రావు వెంకట్రామిరెడ్డి, రేగలగడ్డ తేజ, కన్నా ప్రసాద్, పామంజి రామదాసుతోపాటు పలువురు అధికారులు తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి పూర్వ వైభవం

### -రైతన్న కోసం పంచసూత్రాల కార్యక్రమం: ఎమ్మెల్యే



**వెంకటాచలం నవంబర్ 24 ప్రభాతవార్త:** వ్యవసాయానికి పూర్వ వై భవం వచ్చిందని చంద్రబాబు నాయు డు నాయకత్వంలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయటం జరి గిందని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పరిధిలోని కనుపూరు గ్రామంలో రైతన్న కోసం పంచ సూ త్రాల కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతన్న మీకోసం ఈరోజు నుంచి ఈ నెల 29 వివిధ రకాల అంశాల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నీటి భద్రత ఫుడ్ ప్రాసెసింగ్ మద్దతు ధర తదితర అంశాలపై పంట సాగు కల్పించబడుతుంది. వైసీపీ హయంలో మూలబడ్డ బిందు తుంపర్ల సేద్యం తిరిగి ప్రారంభించబడుతుందన్నారు. నేను వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రైతులకు 23,500 మందికి రైతు రథాలు సబ్సిడీతో అందజేయడం జరిగిందన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వ్యవసాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఛైర్మన్ రావూరు రాధాకృష్ణ నాయుడు., మండల అధ్యక్షుడు కట్టం రెడ్డి రాధారెడ్డి, సర్వేపల్లి డిస్ట్రిబ్యూటీ కెనాల్ ఛైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, భ బొమ్మి సురేంద్ర కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్. ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, వంశి, పాల్గొన్నారు.